

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరుమల్‌యన్

## హయ్యర్ పెన్షన్‌కు అందరూ అర్హులే..

చిక్కడపల్లి, జూలై 17: టీఎస్ ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్, ఏపీ ఎస్ ఆర్టీసీ స్టాఫ్, స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సుప్రీం 'కోర్టు తీర్పు అమలు-హయ్యర్ పెన్షన్ సమస్యల'పై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీఐటీయూ జాతీయ కార్యదర్శి, పీఎఫ్ బోర్డు సభ్యుడు ఆర్.కరుమల్‌యన్ హాజరై మాట్లాడారు. పెన్షనర్స్‌పై సర్క్యులర్స్ పరిశీలించానని, హయ్యర్ పెన్షన్‌పై సుప్రీంకోర్టు తీర్పును పరిశీలిస్తే హయ్యర్ పెన్షన్‌కు అందరూ అర్హులే అని చెప్పారు. పీఎఫ్ ట్రస్టులో రూ.25లక్షల కోట్లు జమ అయ్యిందని, ఇది దక్షిణ భారతదేశ రాష్ట్రాల బడ్జెట్ కంటే ఎక్కువ అని పేర్కొన్నారు. ఇందులో 500 కోట్లను స్టాక్ షేర్ మార్కెట్‌లో పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. సుమారు 11 కోట్ల పెన్షన్ సభ్యులు ఉన్నారని, వేతన సవరణ అనంతరం పెన్షన్ పెరగాల్సిన అవసరం ఉందన్నారు. టీఎస్ ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు వీరాంజనేయులు, ఏపీఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు జిలానీ పాషా, టీఎస్ ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వీఎస్.రావు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సీఆర్ జీఎంను కలిసిన ఎంపీ ఈటల

హైదరాబాద్, జూలై 17(నమస్తే తెలంగాణ) : మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ దక్షిణ మధ్య రైల్వేజోన్ జనరల్ మేనేజర్‌ను బుధవారం కలిశారు. తన ప్రాంతానికి సంబంధించిన పలు రైల్వే ప్రాజెక్టుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సూర్య కిరణ్

## 6న గద్దర్ వర్ధంతి సభ

ఖైరతాబాద్, జూలై 17: గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 6వ తేదీన రవీంద్రభారతిలో మొదటి వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సూర్య కిరణ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది ఆగస్టు 6న గద్దర్ మరణించారని, ఆయన ఆశయాలు ముందుకు తీసుకుపోవాలన్న ఉద్దేశంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 6న మధ్యాహ్నం 2గంటల నుంచి ఈ సభ ప్రారంభమవుతుందని, త్వరలో మరో సమావేశం నిర్వహించి హాజరయ్యే అతిథుల వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షులు పృథ్వీరాజ్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, గాదె ఇన్నయ్య, ఏపూరి సోమన్న, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్షయవ్యాధి నివారణకు పతంజలి ఛోటీ కటేలి..

జూబ్లీహిల్స్, జూలై 17: క్షయవ్యాధి నివారణకు పతంజలి 'ఛోటీ కటేలి'.. మూలికా ఔషధాలను అభివృద్ధి చేసింది. ఈ మేరకు మైక్రో బ్యాక్టీరియా, ట్యూబర్ క్యులోసిస్ వల్ల సంక్రమించే టీబీ నివారణకు ఇది సమర్థవంతంగా పని చేస్తుందని పతంజలి పరిశోధకులు ఆచార్య బాలకృష్ణ తెలిపారు. క్షయవ్యాధి చికిత్స కోసం మూలికా ఔషధాలను అభివృద్ధి చేయడం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు పతంజలి జరిపిన అధ్యయనంలో ప్రస్తుతం ఉన్న టీబీ విధానానికి ప్రత్యామ్నాయంగా మూలికా చికిత్సలను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఇందులో సోలనమ్ వరీనియానమ్ ఎక్స్‌ట్రాక్ట్(ఎస్‌విఈ), యాంటీ ట్యూబర్‌క్యూలర్ థెరపీ మంచి ఫలితాలు ఇచ్చినట్లు తెలిపారు.

## 'జికా' సోకిన గర్భవతుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### డాక్టర్ తారకేశ్వరి



అబిడ్స్, జూలై 17 : జికా వైరస్ ఇన్ఫెక్షన్ సంబంధించి గర్భవతులను పరీక్షించడం, పాజిటివ్ వచ్చిన తల్లులలో పిండాల పెరుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఫెర్నాండెజ్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ తారకేశ్వరి ఆసుపత్రులకు సూచించారు. ఫెర్నాండెజ్ ఆసుపత్రిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. జికా వైరస్‌ను నివారించడంలో భాగంగా సామాజికంగానే కాకుండా వ్యక్తిగతంగా ప్రత్యేక చర్యలు తీసుకుని దోమ కాటు నుంచి సంరక్షించుకోవాలని తెలిపారు. కమ్యూనిటీలో నీటి కంటైనర్‌లను మూసి ఉంచడం, పరిశుభ్రతపైన అవగాహన కల్పిస్తూ కమ్యూనిటీల పరిశుభ్రతకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం ప్రధానమని డాక్టర్ తారకేశ్వరి పేర్కొన్నారు. శరీరాన్ని కప్పి ఉంచేలా దుస్తులు ధరించడం, పెర్మెత్రిన్-పూతతో కూడిన వలలను ఉపయోగించడంతోపాటు గర్భాధారణ సమయంలో సురక్షితమైన డీఈఈటీ వంటి దోమల నివారణకు ఉపయోగించడం తప్పనిసరి అని వివరించారు. జికా వైరస్ ప్రధానంగా వ్యాధికారక ఆడ ఏడెస్ దోమ కాటుతో వ్యాపిస్తుందని, గర్భధారణ సమయంలో, ప్రసవ సమయంలో తల్లి నుంచి పిండానికి కూడా వ్యాపిస్తుందని, ఆర్‌టీ-పీసీఆర్ పరీక్ష నిర్వహించడం వలన జికా వైరస్‌ను నిర్ధారించడంలో సహాయ పడుతుందని తెలిపారు.

## మన భూమిని కాపాడుకుంటేనే భవిష్యత్

### ఎస్‌బీఐ ఆధ్వర్యంలో పెడల్ ఫర్ ది ప్లానెట్ సైక్లోథాన్

జూబ్లీహిల్స్, జూలై 17: పర్యావరణ పరిరక్షణతో మన భూమిని కాపాడుకుంటేనే మన భవిష్యత్ బాగుంటుందని ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం నెక్లెస్ రోడ్‌లోని పీవీ జ్ఞానభూమి నుంచి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో పెడల్ ఫర్ ది ప్లానెట్ సైక్లోథాన్‌ను సర్కిల్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీఎం ప్రకాశ్ చంద్ర బారోర్, రవికుమార్ వర్మ, ఏజీఎం జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# పైగా ప్యాలెస్‌కు పోయేదెప్పుడో?

హెచ్‌ఎండీఏ కార్యాలయాల తరలింపుపై వీడని సందిగ్ధం

రెండు నెలల కిందటే కార్యాచరణ పూర్తి

జీవో జారీ అయినా ముందుకు సాగని పనులు

జీహెచ్‌ఎంసీ కమిషనర్ మార్పుతో అటకెక్కిన ప్రణాళికలు



సిటీబ్యూరో, జూలై 17(నమస్తే తెలంగాణ): నగర వ్యాప్తంగా విస్తరించి ఉన్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయాల తరలింపు ఇంకా సందిగ్ధం వీడలేదు. తార్నాక, అమీర్‌పేట్, నానక్‌రాంగూడ, లుంబినీ పార్క్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయాలను బేగంపేట్‌లోని పైగా ప్యాలెస్‌లోకి మార్చుతామంటూ రెండు నెలల కిందటే కార్యాచరణ రూపొందించారు. ఇందుకు ప్రభుత్వం కూడా జీవోతో ఆదేశాలు జారీ చేసింది. అప్పటికప్పుడు అధికారులు కూడా పైగా ప్యాలెస్‌లో మార్పులు, చేర్పులతో పనులు చేపట్టారు. అయితే నెలలు గడుస్తున్నా పైగా ప్యాలెస్ తరలింపులో పనులు మందగించాయి. అదే సమయంలో ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది సందిగ్ధంలో ఉన్నారు. నిజానికి ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసి, ఆగస్టులోనే పైగా ప్యాలెస్ నుంచి హెచ్‌ఎండీఏ కార్యకలాపాలు నిర్వహించాలని జీవోలో పేర్కొన్నారు. కానీ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి వెళ్లిపోవడంతో తరలింపు ప్రణాళికలు అటకెక్కించినట్లుగా తెలుస్తోంది.

హైదరాబాద్ నగరంలో చారిత్రక వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన బేగంపేట్‌లోని 'పైగా ప్యాలెస్'ను హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయంగా మార్చేందుకు సర్కారు ప్రయత్నం చేసింది. అందుకు హడావిడిగా తరలింపు ప్రణాళికలు, జీవోలను విడుదల చేసి 'పైగా ప్యాలెస్'లో సిద్ధం చేయాలని ఆదేశించింది. ప్రభుత్వం జీవో జారీ చేసిన సమయంలో హెచ్‌ఎండీఏ ఇన్‌చార్జి బాధ్యతలను ఐఏఎస్ ఆమ్రపాలి నిర్వర్తిస్తుండగా... తరలింపు పనులపై అధికారులతో సమీక్షించారు. కానీ తాజాగా ఆమె స్థానంలో పూర్తిస్థాయి మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఐఏఎస్ సర్ఫరాజ్ అహ్మద్ రావడంతో తరలింపు పనులు పక్కనపెట్టినట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే ప్రధాన కార్యాలయానికి అవసరమైన పనులను సగానికి పైగా పూర్తి చేసిన ఇంజినీరింగ్ అధికారులు.. ఉన్నతాధికారుల నుంచి స్పందన లేకపోవడంతో పనులను చేపట్టేందుకు ఆసక్తి చూపడంలేదు. సుమారు లక్ష చదరపు అడుగులకు పైగా ఉన్న విస్తీర్ణంలో హెచ్‌ఎండీఏ కార్యాలయాన్ని 'పైగా ప్యాలెస్'లో సిద్ధం చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించారు. అందుకు అనుగుణంగా ఇంజినీరింగ్ విభాగం ప్యాలెస్‌లో ఉన్న మౌలిక వసతులు, ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాల పరిశీలన తర్వాత పనులు చేపట్టింది. మౌలిక వసతులు, విద్యుత్, ఐటీ, నెట్ వర్కింగ్ వసతులను కల్పించేందుకు చర్యలు చేపట్టారు. గతంలోనూ తార్నాకలో ఉన్న ప్రధాన కార్యాలయాన్ని అమీర్‌పేట్ స్వర్ణజయంతికి తరలించే క్రమంలోనూ ఇదే తీరుగా తర్జనభర్జనలతో సాగిన ప్రక్రియ ఏడాది తర్వాత అమీర్‌పేట్ నుంచి కార్యకలాపాలను ప్రారంభించారు. కానీ ఇక్కడ ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలు, ఇతర కార్యాలయాలతో నిత్యం రద్దీగా ఉండటంతోపాటు మూడు ప్రాంతాల్లో ఉన్న హెచ్‌ఎండీఏ విభాగాలతో కార్యకలాపాలకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి.

### మారితే ఒకేచోట సేవలు..

ఏడు జిల్లాల్లో విస్తరించి ఉన్న హెచ్‌ఎండీఏకు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పక్కా భవనం లేదు. తార్నాకలో ఉన్నప్పుడు కూడా చాలీ చాలని గదుల్లోనూ అధికారులు విధులు నిర్వర్తించారు. స్వర్ణజయంతికి వచ్చిన తర్వాత కొన్ని విభాగాలు నానక్‌రాంగూడకు తరలించడం, మరికొన్ని విధులను బీపీపీ నుంచి నిర్వర్తించడంతో ఉన్నతాధికారుల సమీక్షలు, సమావేశాల సందర్భంలో కార్యాలయాల చుట్టూ తిరగడానికే సరిపోయేది. స్వర్ణజయంతి కార్యాలయంలోకి మార్చిన సంస్థకు ఆదాయాన్ని తీసుకువచ్చే ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో అద్దెలను కోల్పోవడంతోపాటు ఇతర కోచింగ్ సెంటర్లు, ఐటీ సంస్థలతో కార్యాలయం ఎప్పుడూ రద్దీగానే ఉంది. దీంతో విశాలమైన గదులతో పునరుద్ధరించినప్పటికీ ఒకేచోట హెచ్‌ఎండీఏ విభాగాలను ఏర్పాటు చేసుకునేంత చోటులేదు. ఈ క్రమంలోనే హెచ్‌ఎండీఏ కార్యాలయానికి పూర్తిస్థాయి భవనంగా 'పైగా ప్యాలెస్'ను చేసుకోవాలని ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. కానీ ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి స్పందన లేకపోవడంతో అసలు ఇప్పట్లో తరలింపు ప్రక్రియ ఉంటుందో ఉండదో తెలియని పరిస్థితి ఏర్పడింది.



ఉప్పల్ భగాయత్‌లో చేపడుతున్న సెల్లార్ నిర్మాణ పనులు

## వర్షాకాలంలోనూ ఆగని సెల్లార్ తవ్వకాలు

### చోద్యం చూస్తున్న అధికారులు

ఉప్పల్, జూలై 17: కాప్రా సర్కిల్ పరిధిలో వర్షాకాలంలోనూ జోరుగా సెల్లార్ల తవ్వకాలు చేపడుతున్నారు. ప్రధాన రహదారుల్లో సెల్లార్లు తవ్వుతున్నా అధికారులకు మాత్రం కనిపించకపోవడం గమనార్హం. వర్షాలు పడుతుండటంతో సెల్లార్లలో నీరు చేరింది. దీంతో దోమలు వ్యాప్తి చెంది, సమీప కాలనీలవాసులకు ప్రమాదకరంగా మారింది. నీటి గుంతలు ప్రమాదాలకు నెలవు కానున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వీటిపై దృష్టి సారించడం లేదు. నాచారం ప్రధాన రహదారిని సీఎస్ బ్రదర్స్ పక్కనే సెల్లార్ కోసం పనులు ప్రారంభించినా కాప్రా సర్కిల్ సిబ్బంది పట్టించుకోవడంలేదు. ఏఎస్ రావునగర్, మల్లాపూర్ ప్రధాన రహదారిలోని సెల్లార్ నిర్మాణాలపై దృష్టిసారించి చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే పలువురు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తున్నది.

### ఉప్పల్ భగాయత్‌లో ఆగని నిర్మాణాలు

ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో సెల్లార్ నిర్మాణాల కోసం తవ్వకాలు చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన ఉప్పల్ సర్కిల్ అధికారులు చర్యలు చేపట్టడంలేదు. నిర్మాణాలు పూర్తి చేసేవరకు చూసి, ఆ తర్వాత నోటీసులు అందించి వదిలేస్తున్నారు. ఉప్పల్ భగాయత్‌లో కమర్షియల్ నిర్మాణాలు జరుగుతున్నా వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవంలేదు. ఎలాంటి ట్యాక్స్ వేయకుండా, చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



## ప్రశాంతంగా మొహర్రం ర్యాలీ

### దట్టీలు సమర్పించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సిటీ కొత్వాల్

సిటీబ్యూరో, జూలై 17 (నమస్తే తెలంగాణ): త్యాగాలను గుర్తు చేస్తూ బుధవారం మొహర్రం సందర్భంగా పాత నగరంలో నిర్వహించిన ర్యాలీ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఏర్పాట్లను పరిశీలించి మొహర్రం సందర్భంగా దట్టీని సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అన్ని విభాగాలు సమన్వయంతో ఏర్పాట్లు చేశారని, స్వయంగా ఇక్కడ ఏర్పాట్లను పరిశీలించి దట్టీ సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. త్యాగాలను గుర్తు చేస్తూ పవిత్రంగా ర్యాలీలు నిర్వహిస్తున్నారని, ఈ సందర్భంగా తాను కూడా దట్టీని సమర్పించానన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ 2500 మంది సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. ర్యాలీ పూర్తయ్యే వరకు ఇక్కడే ఉండి పరిస్థితిని సమీక్షిస్తుంటానని సీపీ మీడియాతో తెలిపారు. సీపీతోపాటు అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్, ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత

## కారంచేడు బాధితుల పోరాటం స్ఫూర్తిదాయకం

చిక్కడపల్లి, జూలై 17 : కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్)తెలంగాణ ఆధ్వర్యంలో కారంచేడు దళిత మృతవీరుల సంస్మరణ సభను బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జయరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, హైకోర్టు న్యాయవాది బత్తుల కార్తిక్ నవయాన్, ఎస్ఎస్‌డీ దక్షిణ భారత రాష్ట్రాల అధ్యక్షుడు రెంజర్ల రాజేశ్, ప్రజా కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు జాన్, కేఎన్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరం అభినవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కారం చేడు బాధితులు నడిపిన పోరాటం ఇప్పటికీ ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు.

## పండుగ సాయన్న జీవితం స్ఫూర్తిదాయకం

### శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్



హైదర్‌గూడ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో సాయన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బండ ప్రకాశ్ ముదిరాజ్

హిమాయత్‌నగర్, జూలై 17: సమాజంలో పేదరికంతో అలమటిస్తున్న ప్రజల హక్కుల కోసం పోరాడిన బహుజన వీరుడు పండుగ సాయన్న జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని శాసన మండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు. తెలంగాణ పోరాట యోధుడు పండుగ సాయన్న జయంతి సందర్భంగా బుధవారం హైదర్‌గూడలోని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండ ప్రకాశ్ మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ జిల్లాలోని మెరుగోనిపల్లి గ్రామంలో పుట్టిన సాయన్న నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి పేదలకు అండగా నిలిచి అన్నార్తులకు అన్నం పెట్టిన మహానుబావుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బల్ల సత్తయ్య, యాదగిరి, కార్యనిర్వాహక కార్యదర్శి కనకయ్య, కృపాసాగర్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పండుగ బాలు, రాష్ట్ర కోఆర్డినేటర్ బొక్క శ్రీను ముదిరాజ్, నాయకులు రమేశ్, పోకల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ మార్గంలో మాస్టర్ ప్లాన్ వద్దు

### కీసర మండల ప్రజాప్రతినిధుల ఏకగ్రీవ తీర్మానంతో ప్రభుత్వానికి సూచన

సిటీబ్యూరో, జూలై 17(నమస్తే తెలంగాణ) : హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ తమ గ్రామాల్లో అమలు చేయవద్దని కీసర మండల ప్రజాప్రతినిధులు ఏకగ్రీవ తీర్మానంతో ప్రభుత్వానికి సూచన చేశారు. కీసర మండల ప్రజాప్రతినిధుల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు మాస్టర్‌ప్లాన్ ప్రకారం నిర్మించాల్సిన 200 ఫీట్ల వెడల్పు రోడ్లను వ్యతిరేకించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఘట్‌కేసర్ నుంచి శామీర్‌పేట్ వెళ్లే మార్గాన్ని 200 ఫీట్ల రోడ్డును, 100 ఫీట్లుగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. బోగారం, కీసర, తిమ్మాయిపల్లి మీదుగా వెళ్లే ఈ మార్గంలో 200 ఫీట్లతో మాస్టర్ ప్లాన్ అమలు చేస్తే విలువైన భూములు, నిర్మాణాలు, ఇండ్లను కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం స్పందించి హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్ సవరించాలంటూ ఏకగ్రీవ తీర్మానానికి సభ్యులందరూ ఆమోదం తెలుపుతూ లేఖ విడుదల చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.జి.చిన్నారెడ్డి

## భూదాన్ యజ్ఞ బోర్డు పునరుద్ధరణకు కృషి

రవీంద్రభారతి, జూలై 17 : భూదాన్ యజ్ఞ బోర్డు పునరుద్ధరణకు, అన్యాక్రాంతమైన భూదాన్ భూములను తిరిగి భూదాన బోర్డుకు అప్పగించడం, అమరవీరుల చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చడం, వారి విగ్రహాల ఏర్పాటు అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో భూదాన రాంచంద్రారెడ్డి 119 జయంతి వేడుకలు భూదాన వెదిరె రామచంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ డాక్టర్ వెదిరె ప్రబోద్ చంద్రారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి విచ్చేసి వెదిరె రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా.జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ.. అన్యాక్రాంతమైన భూదాన భూములను తిరిగి భూదాన యజ్ఞ బోర్డుకు అప్పగించడం, భూదాన భూములను పేదలకు పంచే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లేలా కృషి చేస్తానన్నారు. అదే విధంగా అమరవీరుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, వారి చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చే విధంగా కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డా.గంటా జలేందర్‌రెడ్డి, సర్వసేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ మహాదేవ్ విద్రోహీ, అఖిలభారత సర్వసేవ సంఘ్ జాతీయ అధ్యక్షుడు వెదిరె అరవింద్‌రెడ్డి, తెలంగాణ కన్వీనర్ కృష్ణాగౌడ్, ఎ.రవీంద్రాచారి, భీంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మల్లు కరుణ, ఆరుట్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తీర్మార్ మల్లన్న ఒత్తిడి తెస్తే.. నా ఇంటిని కూల్చుతారా?

### దుండిగల్ మున్సిపల్ అధికారులను ప్రశ్నించిన కౌన్సిలర్ శంకర్‌నాయక్



దుండిగల్, జూలై 17 : కాంగ్రెస్ కార్యకర్తలు ఫిర్యాదు చేశారనే నెపంతో ఇరువై ఏండ్లుగా ఇంటి పన్ను కడుతున్న తమ ఇంటిని మున్సిపల్ అధికారులు కూలగొడుతామని బెదిరిస్తుండటం ఎంతవరకు సమంజసమని దుండిగల్ మున్సిపాలిటీ 27వ వార్డు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ కొర్ర శంకర్‌నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. తమ తాత అయినా కొర్ర శ్రీరాములు నుంచి తమ తండ్రి హరిలాల్ ద్వారా తమకు సంక్రమించిన ఇంటి స్థలానికి 1981లో వీకర్ సెక్షన్ కింద అప్పటి ప్రధాని తమకు ఇండ్లు కట్టించి ఇచ్చారన్నారు. నాటి నుంచి 3-26 పేరిట ఇంటి నంబర్, విద్యుత్ మీటర్ సైతం ఉందన్నారు. నాటి నుంచి క్రమం తప్పకుండా ఇంటి పన్ను చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి వివరాలు పంచాయతీ రికార్డుల్లోనూ ఉన్నాయన్నారు. 2008-09లోనూ తమ కుటుంబంలోని మహిళల పేరుమీద ఇంటి పట్టాలను అప్పటి ప్రభుత్వం పంపిణీ చేయగా.. 2010 ఆగస్టులో గాగిళ్లాపూర్ గ్రామ పంచాయతీ నుంచి జీ+2 అంతస్థుల నిర్మాణానికి అనుమతులు పొందామన్నారు. గత పదేండ్లుగా ఏడాదికి రూ.9వేల చొప్పున ఇంటి పన్ను చెల్లిస్తున్నామని తెలిపారు. అయితే ఇటీవల వసంత అనే ఓ మహిళ ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు, తప్పుడు పత్రాల ఆధారంగా మున్సిపల్ కమిషనర్ తనకు నోటీసులు జారీ చేశారని, ఈనెల 28వ తేదీ నాటికి ఇంటిని కూలగొడుతామని బెదిరిస్తున్నారని వాపోయారు. అలా ఎందుకు చేస్తారని ప్రశ్నిస్తే.. తనకు తీన్మార్‌మల్లన్న ఫోన్ చేస్తున్నారని, తనపై తీవ్రమైన ఒత్తిడి ఉందని కమిషనర్ తెలుపడం ఎంత వరకు కరెక్ట్... అని శంకర్‌నాయక్ ప్రశ్నించారు. ఎవరో ఒత్తిడి చేశారని తమ ఇంటిని ఎలా కూలగొడుతారన్నారు. దీనిపై ఎంత వరకైనా తాము పోరాడుతామని స్పష్టం చేశారు.